సాక్షి చిత్తూరు

సోమవారం । 13 । అక్టోబర్ । 2025



బోయకొండ కిటకిట

బోయకొండకు ఆదివారం కర్ణాటక రాష్ట్రం, జిల్లా నుంచి భక్తులు తరలిరావడంతో జనసంద్రంగా మారింది. - 8లో



కనిపిస్తే.. కరిచేస్తాయ్!

జిల్లాలో వీధి కుక్కలు కనిపిస్తే చాలు వెంటపడి కరిచేస్తున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. - 8లో



కూటమి భూమాయ!

పేదలకు పంపిణీ చేసిన భూములను కూటమి నేతలకు కట్టబెడుతుండంతో బాధితులు లబోదిబోమంటున్నారు. - 8లో

న్యూస్‌రీల్

25న పెద్ద శేష వాహన సేవ

తిరుమల: తిరుమలలో అక్టోబర్ 25న నాగుల చవితి పర్వదినం సందర్భంగా పెద్ద శేష వాహనంపై రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీ మలయప్పస్వామివారు ఉభయ దేవేరులతో కలిసి దర్శనమివ్వనున్నారు.ఆ దిశేషువు జగన్నాథునికి తల్పంగా స్వామివారికి సేవలందించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ మేరకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ తుషార్ డూడీ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

వరసిద్ధుని సేవలో జూనియర్ ఎన్టీఆర్ సతీమణి



స్వామి వారి చిత్రపటం అందుకుంటున్న ప్రణతి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ సతీమణి ప్రణతి దర్శించుకున్నారు. ఆమెతో పాటు సినీ నటుడు నార్నె నితిన్, వారి కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దగ్గరుండి స్వామి దర్శనం కల్పించారు. వేద ఆశీర్వచనాలు, స్వామి ప్రసాదం, చిత్ర పటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, బాలాజీనాయుడు తదితరులున్నారు.

రాజకీయాల్లో కొందరు నేతలు నైతిక విలువలను వదిలేస్తున్నారు. పదవుల కోసం ఎత్తులు వదిలేసి జిత్తులకు దిగుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోసం యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. చివరకు ప్రాణాలు తీసేందుకు సైతం దిగజారుతున్నారు. ఇదే కోవలో జనసేన మాజీ నేత కోట వినూతపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పలు కుట్రలకు తెగబడినట్లు సోషల్ మీడియాలోకి వచ్చిన ఓ వీడియో వైరల్‌గా మారింది. వినూత డ్రైవర్‌గా పనిచేసి హత్యకు గురైన రాయుడు తీసుకున్నట్టుగా చెబుతున్న సెల్ఫీ వీడియో జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. కోట దంపతులను టార్గెట్ చేసుకుని బొజ్జల తనకు డబ్బులు ఎరవేసినట్లు డ్రైవర్ స్పష్టంగా వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. అయితే నేతల నడుమ పోరులో చివరకు సదరు దళితుడు బలి కావడం విషాదంగా మిగిలింది.



అవునా బొజ్జలా?

కలకలం రేపిన రాయుడి సెల్ఫీ వీడియో

- చర్చనీయాంశంగా మారిన సుధీర్‌రెడ్డి వ్యవహారం
- కోట వినూతపై కుట్రలకు పాల్పడినట్లు ఆరోపణలు
- డబ్బులు ఎరవేశారని వీడియోలో వెల్లడించిన డ్రైవర్ రాయుడు
- విషయం బయటపడడంతోనే హత్యకు గురైన దళితుడు



వినుత



వీడియోలో శ్రీనివాస్ అలియాస్ రాయుడు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కోట వినూత వద్ద డ్రైవర్‌గా పనిచేసిన శ్రీనివాసులు అలియాస్ రాయుడు మాట్లాడినట్టుగా వచ్చిన ఓ సెల్ఫీ వీడియోలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై పలు ఆరోపణలు వినిపించాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టికెట్ కోసం కుట్ర పన్నినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే వినూత రహస్య సమాచారం, కొన్ని వీడియోలు సేకరించి అధిష్టానానికి చేరవేసి సుధీర్‌రెడ్డి టికెట్ సాధించినట్లు శ్రీకాళహస్తి వాసులు చర్చించుకుంటున్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి కారణంగా కూటమిలోని అనేక మంది నేతలు రాజకీయంగా అణచివేతకు గురవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో ఎన్నికల ముందు కూటమిగా ఏర్పడిన టీడీపీ, జనసేన, బీజేపీలోని ముఖ్య నేతలు టికెట్లు దక్కించుకునేందుకు ఒకరిని ఒకరు వెన్నుపోట్లు పొడుచుకున్న విషయం తెలిసిందే. ప్రధానంగా శ్రీకాళహస్తి టికెట్ కోసం ఏకంగా హత్యా రాజకీయాలకు తెరతీశారనే ప్రచారం కోట వినూత డ్రైవర్ రాయుడు వీడియో ద్వారా గుప్పుమంది. శ్రీకాళహస్తి అసెంబ్లీ టికెట్ కోసం కూటమి పార్టీలోని బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య కుమారుడు, బీజేపీ నేత కోలా ఆనంద్, జనసేన నేత కోట వినూత పోటీ పడిన విషయం విధితమే. టికెట్ దక్కించుకునేందుకు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలే చేశారు. ఈక్రమంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలు చేయడంతో పాటు.. ఆయా పార్టీల అధిష్టానాలకు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. ఒకానొక సందర్భంలో మీడియా ముఖంగా వీధికెక్కారు.

ఆరోపణలు నిజమేనా?

డ్రైవర్ రాయడు హత్య తర్వాత అరెస్ట్ అయిన కోట వినూత దంపతులు మీడియా సాక్షిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పేరును ప్రస్తావించారు. రాయుడి హత్య వెను ఎవరి పాత్ర ఉందని మీడియా ప్రశ్నించిన సమయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేరును వెల్లడించడం నాడు కలకలం రేపింది. అన్ని విషయాలను త్వరలోనే బయటపెడతామని చెప్పినట్టే.. నేడు రాయుడి వీడియో వైరల్ కావటం పెద్ద దుమారమే రేపుతోంది. శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలి అధ్యక్ష పదవిని కొట్టే సాయికి కట్టబెట్టడం వెనుక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హస్తం ఉందని కోట వినూత లేఖ ద్వారా ఆరోపించింది. బొజ్జల సుధీర్‌రెడ్డికి టికెట్ కేటాయించడం వెనుక జనసేనలోని మరో నాయకుడు కొట్టేసాయి ఉన్నారని రాయుడు వీడియో ద్వారా తెలుస్తోంది. అదే విధంగా శ్రీకాళహస్తిలో పలువురు ప్రధాన భూమిక పోషించారని డ్రైవర్ వీడియో ద్వారా వెల్లడవుతోంది. ఈ క్రమంలోనే రాబోయే రోజుల్లో ఇంకెన్ని వీడియోలు, వాయిస్ రికార్డులు బయటకు వస్తాయోనని కూటమి నేతలు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

నాడు టీడీపీ, జనసేన నేతల మధ్యే పోటీ

సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి పార్టీల సీట్ల కేటాయింపుకు సంబంధించి శ్రీకాళహస్తి టికెట్ టీడీపీ లేదా జనసేనలో ఒకరికి ఇస్తారని ముందుగానే తేలిపోయింది. దీంతో కోట వినూతను లక్ష్యంగా చేసుకుని ఆమె డ్రైవర్‌ని కోవర్టుగా బొజ్జల సుధీర్‌రెడ్డి ఎంపిక చేసుకున్నట్లు రాయుడి వీడియో ద్వారా బయటపడింది. ఒకరి విషయాలు ఒకరు తెలుసుకునేందుకు కూటమి నేతలు కోవర్టులను నియమించుకున్నారు. అందులో భాగంగా కోట వినూత విషయంలో బొజ్జల చాలా దూరంగా ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. అందుకే డ్రైవర్ రాయుడుకి రూ.60 లక్షలు ముట్టజెప్పేందుకు సిద్ధమైనట్లు వీడియో ద్వారా వెలుగు చూసింది. అలాగే అనేక మందిని పావుగా వాడుకున్నట్లు వీడియో ద్వారా వెల్లడైంది. చివరకు కోట వినూత దంపతులను యాక్సిడెంట్ ద్వారా హత్య చేసేందుకు సైతం రెండు పర్యాయాలు యత్నించినట్లు రాయుడు వీడియో ద్వారా బయటపెట్టాడు. రాజకీయ పోరులో దళితుడైన సీహెచ్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్యకు గురవడం అప్పట్లో సంచలనంగా మారింది. రాయుడు హత్యకు దారి తీసిన కారణాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

గ్రావెల్ అక్రమ తరలింపుపై కొరడా

- నలుగురు అరెస్ట్.. ఏడుగురిపై కేసు

సాక్షి ఎఫెక్ట్..

పుత్తూరు : పట్టణ పరిధిలోని మరాఠిగేట్ గుట్టలో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, 3 టిప్పర్లను పోలీసులు సీజ్ చేసిన సంఘటన శనివారం చోటు చేసుకొంది. గత నెల 21వ తేదీన సాక్షి దినపత్రికలో ‘మరాఠిగేట్ గుట్ట మటాష్’ అనే కథనం ప్రచురితమైంది. దీనిపై కొద్ది రోజుల పాటు తవ్వకాలకు స్వస్తి పలికిన అక్రమార్కులు శనివారం మళ్లీ పనులు మొదలు పెట్టడంతో పోలీసులు దాడి చేశారు. దీనిపై ఎస్‌ఐ ఓబయ్య కథనం మేరకు.. మరాఠిగేట్ గుట్ట వద్ద శనివారం పోలీసులు జరిపిన దాడిలో వడమాలపేటకు చెందిన డ్రైవర్లు మంగయ్య, తిరుమలయ్య, సురేష్, హరిలను అరెస్ట్ చేశారు. తిరుపతి, వడమాలపేటలకు చెందిన వాహన యజమానులైన షమీర్, గుణ, గురవయ్యలపైనా కేసు నమోదు చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో కుండపోత వర్షం

కాణిపాకం : జిల్లాలో పలుచోట్ల ఆదివారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. తొమ్మిది గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో కూడిన ఈ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చిత్తూరు నగరం, చిత్తూరు రూరల్, గుడిపాల, యాదమరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, తవణంపల్లి తదితర ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. వాగులు, వంకల్లో నీటి ప్రవాహం పెరిగింది. సాగులో ఉన్న పంటలు వర్షానికి పూర్తిగా నీట మునిగాయి.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 84,571 మంది స్వామివారిని దర్శించుకోగా 36, 711 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.70 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కూటమి కల్తీ మద్యంపై నిరసనలు



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో సమావేశమైన నేతలు

పుంగనూరు : కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం మాఫియా, వేల కోట్ల రూపాయలను చట్ట వ్యతిరేకంగా దోచుకోవడంపై సోమవారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. ఆదివారం తిరుపతిలో పుంగనూరు నియోజకవర్గ నాయకులు , వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు కొండవీటి నాగభూషణం, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, వల్లివేడు పృథ్వీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషాలతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా కల్తీ మద్యం వ్యాపారంతో వేల కోట్లు దోచుకుంటున్న తెలుగుదేశం నాయకుల వ్యాపారాల గురించి ప్రజలకు వివరిస్తూ చైతన్యం చేయాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పుంగనూరు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్, నాయకులు గౌస్, అఖిల్, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

అనవసరంగా కేసులో ఇరికించారు

–పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి వీడియో వైరల్

సాక్షి టాస్క్‌ఫోర్స్: పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో అనవసరంగా కేసు పెట్టించారని ఆదివారం రాత్రి ఓ వ్యక్తి బయట పెట్టిన వీడియో వైరల్‌గా మారింది. పసికందుతో పాటు ఆ వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో తనకు అన్యాయం జరుగుతోందని ఆగ్రహంతో ఊగిపోయిన వీడియో కలకలం రేపాయి. ఆ వీడియోలో ఏముందంటే.. పూతలపట్టు పోలీస్‌స్టేషన్‌లో నాబిడ్డ ఎడుస్తోంది. నా మీద రాంగ్ కేసు పెట్టారు. కేసు కూడా ఫైల్ చేయకుండా.. దొరబాబు చౌదిరి, యువరాజు నాయుడు, గణపతి నాయుడు..ఈ ముగ్గురూ వీళ్లకు ఫోన్ చేశారంట..! ప్లీజ్ నాకు హెల్ప్ చేయండి. నాబిడ్డ చనిపోయినా పర్వాలేదు. మీరు అనవసరంగా కేసులో ఇరికించారు. కేసు పెట్టినోళ్లు ఎక్కడా..? నేను తప్పు చేసుంటే..కేసు ఎక్కడా..? నన్ను మాత్రం లోపల వేస్తారు..? కొడుతారు.. తిడుతారు... నేను అనుభవించాను. దెబ్బలు చూడండి. న్యాయం లేదా సార్. అడుక్కున్నాను. కేసు కట్టకుండా పోలీస్ స్టేషన్‌లో ఎట్లా కూర్చోబెడతారు. నన్ను గుద్దేశారు. నా బాధ ఎవరికి చెప్పుకోవాలి. నా బిడ్డ ఎడుస్తోంది. ఈ వీడియోను అన్ని గ్రూపుల్లో పెడతా..’ అంటూ దినేష్ అనే వ్యక్తి బయట పెట్టిన వీడియో వైరల్‌గా మారింది. ఆ పసికందు పోలీస్ స్టేషన్ టేబుల్ మీద కేకలు పెడుతున్న దృశ్యం కంట తడి పెట్టించింది. కాగా రంగంపేట క్రాస్‌లో ప్రభుత్వ వాహనాన్ని దినేష్ అనే వ్యక్తి ఢీకొనడంతో పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లిందని, మద్యం మత్తులో ఇలా చేస్తున్నాడని చెబుతున్నాయి.

పీహెచ్‌సీలకు సుస్తీ.. సేవలకు స్వస్తి

ప్రభుత్వ వైద్యసేవల్లో నిర్లక్ష్యం అలుముకుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు పడకేశాయి. డాక్టర్లు సమ్మెబాట పట్టడంతో సేవలు నిలిచిపోయాయి. దీనికి తోడు ఆరోగ్య శ్రీసేవలు ఆగిపోయాయి. పేరుకు పోయిన బకాయిల దెబ్బకు నెట్‌వర్క్ ఆస్పత్రులు చేతులెత్తేశాయి. దీంతో ప్రభుత్వ వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారింది. సర్కారు వైద్యం నిర్వీర్యం కావడంతో సామాన్య జనం ప్రాణాలను అరచేతిలో పట్టుకుని ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు.

- కూటమి పాలనలో పడకేసిన వైద్యం
- పీహెచ్‌సీల్లో నిలిచిన ఆరోగ్య సేవలు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు బంద్
- అవస్థల్లో సామాన్య జనం
- పట్టించుకోని పాలకులు



పీహెచ్‌సీ వైద్యుల నిరసన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 8 సీహెచ్‌సీలు, 4 ఏరియా ఆసుపత్రులు, 15 యూపీహెచ్‌సీలు, ఒక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పనిచేస్తున్నాయి. ఇందులో 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం రెండు వారాలుగా విధులు బహిష్కరించి సమ్మె బాటపట్టారు. దీంతో వైద్యసేవలు పేదలకు దూరం అయ్యాయి.

నాడీపట్టే నాథుడే లేరు..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 60 మందికి పైగా వైద్యుల సమ్మె చేస్తుండటంతో చికిత్స చేసేవారు కరువయ్యారు. దీంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీల నుంచి వైద్యులు, పీజీ వైద్యులను సర్దుబాటు చేశారు. ఈ సర్దుబాటు కారణంగా వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు సన్నగిల్లాయి. ఇతర సేవలు సైతం స్తంభించాయి. అలాగే పీహెచ్‌సీల్లో కూడా చాలా చోట్ల వైద్య సేవలు మొక్కుబడిగా అందుతున్నాయి. కొన్ని చోట్ల ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు లేక రోగులు చికిత్స కోసం వచ్చి వెనుదిరుగుతున్నారు.

మందుబిల్లలతో సరిపెడుతూ..

చిన్న రోగాలకు ఫార్మసిస్టులు, నర్సులు మందులు ఇచ్చి పంపిస్తున్నారు. వైద్యుల సమ్మెతో 104 సేవలకు జ్వరమొచ్చింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లపై పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో పల్లె జనం చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్నారు. మందు బిల్లలతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

జిల్లా ఆస్పత్రుల్లో కొరవడిన సేవలు

చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పూర్తిగా కొరవడ్డాయి. ఇక్కడ ప్రధానంగా డాక్టర్ల కొరత వేధిస్తోంది. స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, పలు టెక్నీషియన్లు, ఫార్మసిస్ట్, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ, జీడీఏ తదితర పోస్టుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ కారణంగా ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై అదనపు పనిభారం మోపుతున్నారు. ప్రభుత్వం ఈ ఖాళీలను భర్తీ చేయడంలో నిర్లక్ష్యం చూపుతోంది. తద్వారా వైద్య సేవలు కుంటుపడుతున్నాయి. మధ్యాహ్నానికే పలు సేవలు పరిమితమవుతున్నాయి. దీంతో ప్రజలు వైద్యం కోసం తిప్పలు పడుతున్నారు. ఇదే మాదిరిగానే ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల్లో సమస్యలు వేధిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బకాయిల భారం...

జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు శుక్రవారం నుంచి సమ్మె ప్రారంభించాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో తప్పనిసరై వారు సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కారణంగా జిల్లాలోని పలు నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మె చేస్తున్నట్లు ప్రకటించాయి. ఇందులో కొన్ని ఆసుపత్రులు రోగులకు అత్యవసర వైద్యం అందించేందుకు తాత్కాలికంగా వైద్యసేవలు అందిస్తున్నా ఆరోగ్యశ్రీలో నమోదు చేయడం లేదు. అడ్మిషన్ అవసరమైన వారికి ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నాయి. తర్వాత ఆపరేషన్ చేయాలనుకున్న వారికి మళ్లీ రావాలని వెనక్కి పంపిస్తున్నారు. రూ. వందల కోట్లల్లో పేరుకు పోయిన బకాయిలను చెల్లించే వరకు బంద్ వీడబోమని నెట్‌వర్క్ ఆస్పత్రులు స్పష్టం చేస్తున్నాయి. దీంతో పేదలు కార్పొరేట్ వైద్యానికి తిప్పలు పడుతున్నారు. వైద్యం విషయంలో పేద ప్రజలు అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లా..



ఒళ్లు నీరసంగా ఉండడంతో ఆస్పత్రికి నడవలేక వెళ్లా. నర్సులే సూది వేసి ఏదో టానిక్ ఇచ్చారు.అయినా ఏమాత్రం తగ్గకపోవడంతో డబ్బులిచ్చి ప్రైవేటోళ్ల దగ్గర చూపించుకున్నా. – రవి, యాదమరి

బంద్ అంటే ఎలా?



ఆస్పత్రికి వెళ్లి చూపించుకుందామని చిత్తూరు వెళ్లాను. ఓపీ చూడడంలేదు. బంద్‌లో ఉన్నారన్నారు. ఇలాగైతే మాలాంటి పేదలు ఏమైపోవాలి. పల్లెల్లోని ఆస్పత్రుల్లో డాక్టర్లు ఉండడం లేదు. ప్రభుత్వం స్పందించాలి. –సుబ్రమణ్యం, తయ్యూరు, ఎస్ఆర్‌పురం మండలం

గతంలో లాగా లేదు



గతంలో డాక్టర్లు ఇంటి వద్దకే వచ్చి చూసేవాళ్లు. ఏదైనా అనారోగ్య సమస్యలున్నాయా అని వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు వచ్చేవారు. ఇప్పుడు ఆ మాదిరిగా లేదు. డబ్బులిచ్చి చూపించుకోవాలంటే పేదలకు అగచాట్లే. – రవినాయుడు, కుర్చివేడు, చిత్తూరు మండలం

పీజీ కోటాను పునరుద్ధరించాలి



పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులకు గత పీజీ కోటాను పునరుద్ధరించాలి. ఏళ్ల తరబడి సీఏఎస్‌గా ఉన్న వారికి ప్రమోషన్లు ఇవ్వాలి. ట్రైబల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు ప్రభుత్వం ఇస్తామని చెప్పిన అలవెన్సులు ఇవ్వాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. – మునికుమార్, పీహెచ్‌సీ వైద్యులు, చిత్తూరు

ముగిసిన పర్యటన



హాజరైన ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్, చిత్రంలో జిల్లా జడ్జి అరుణ సారిక

చిత్తూరు అర్బన్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ బీ.కృష్ణమోహన్ రెండు రోజుల జిల్లా పర్యటన ముగిసింది. ఆదివారం చిత్తూరు నగరంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికతో కలిసి చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతోందన్నారు. అదాలత్‌లు నిర్వహించి కేసులను బాగానే పరిష్కరిస్తున్నా.. కొత్త కేసులు కూడా అదే తరహాలో ఫైల్ అవుతున్నాయన్నారు. ఇది న్యాయమూర్తులపై మరింత బాధ్యతను పెంచుతోందని చెప్పారు. ప్రధానంగా దీర్ఘకాలికంగా న్యాయస్థానాల్లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించి, కక్షిదారులకు మేలు చేకూర్చాలన్నారు. కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, విడాకుల కేసుల్లో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారాలు చూపించాలన్నారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు రమేష్, భారతి, శ్రీదేవి, శ్రీనివాసరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.20 లక్షలు చోరీ



పగలగొట్టిన బీరువా

నగరి: పట్టణ పరిధిలోని ఏకాంబర కుప్పం గ్రామంలో తాళాలు వేసిన ఓ ఇంట్లో సుమారు రూ.20 లక్షల భారీ చోరీ జరిగింది. స్థానిక సీఐ విక్రమ్ కథనం మేరకు.. ఏకాంబరకుప్పం గ్రామంలో విద్యుత్ శాఖ ఉద్యోగి నీలకంఠం నివాసం ఉంటున్నాడు. ఈనెల 10వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి అత్తిమంజేరిపేటలో బంధువుల రిసెప్షన్‌కు వెళ్లాడు. 11వ తేదీన ఇంటికి రాగా ఇంట్లో దొంగలు పడ్డట్టు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా తాళాలు పగులగొట్టి అందులోని 174 గ్రాముల బంగారు నగలు, 400 గ్రాముల వెండి వస్తువులు దొంగిలించినట్లు గుర్తించాడు. వీటి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని నీలకంఠం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో తొమ్మిది గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

ఐరాల: మండలంలోని చిగరపల్లెలో విద్యుత్ షాక్‌తో తొమ్మిది గొర్రెలు మృతిచెందాయి. వివరాలిలా ఉన్నాయి.. చిగరపల్లెకు చెందిన ఏసు గొర్రెలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటి పక్కన ఉన్న రేకుల షెడ్‌లో రోజూలాగే శనివారం రాత్రి తన గొర్రెలను ఉంచి, ఇంటికి వెళ్లిపోయాడు. షెడ్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు తెగి పడడంతో షెడ్ చుట్టూ వేసిన ఇనుప కంచెకు తగిలింది. ఆ వైరు ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై షెడ్డులో ఉన్న తొమ్మిది గొర్రెలు మృతి చెందాయి. ఆదివారం ఉదయం వెళ్లి చూసే సరికి గొర్రెలు మృతిచెంది ఉండడంతో బోరున విలపించాడు. జీవనాధారం కోల్పోయానని ఏసు కన్నీరుమున్నీరుగా విలపించాడు. మృతి చెందిన గొర్రెలకు మద్దిపట్లపల్లె పశువైద్యాధికారి పినాకపాణి పోస్టుమార్టం చేశారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

పుంగనూరు: పట్టణ సమీపంలోని బైపాస్ సర్కిల్‌లో ఆదివారం బైక్‌ను లారీ ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం షాపూర్ గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా కుమారుడు జమీర్(24) ద్విచక్ర వాహనంలో పంజాణికి వెళుతున్నాడు. పుంగనూరు బైపాస్ సర్కిల్‌లో అతివేగంగా వచ్చిన ఐచర్ లారీ ఢీకొంది. దీంతో జమీర్ తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో కారులో వెళ్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కొండవీటి నాగభూషణం, కృష్ణమూర్తి ప్రమాదాన్ని గమనించి కారును ఆపారు. బాధితుడికి ప్రథమ చికిత్స చేయించి, 108లో ఆస్పత్రికి తరలించారు. అతను మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కూటమి భూమాయ!

- టీడీపీ సానుభూతి పరులకే భూములు!
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొలిక్కి తెచ్చిన వైనం
- టీడీపీ అధికారంలోకి రావడంతో తారుమారు
- అధికారుల చుట్టూ ఎస్సీ, ఎస్టీలు ప్రదక్షిణలు
- భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆందోళన



జగన్నాథపురంలో ఇటీవల అధికార పార్టీ నేతలు అనధికారికంగా గుట్టను చదును చేసిన దృశ్యం

విజయపురం : వారంతా నిరుపేద కుటుంబానికి చెందినవారు. రోజు కూలికి వెళ్తే గాని పూట గడవని పరిస్థితి. సొంతంగా సెంటు భూమి లేని నిరుపేదలు. తమ బతుకులు మార్చడానికి ఏ మహాత్ముడైనా రాక పోడా అని ఎదురు చూస్తున్న సమయంలో 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. సెంటు భూమి లేని ప్రతి కుటుంబానికి పథకంలో భూములు ఇచ్చారు. ఇలా పన్నూరు దళితవాడ, ఆది ఆంధ్రవాడ, బీసీ కాలనీకి చెందిన 200 కుటుంబాలకు జగన్నాథపురం లెక్క దాఖలో ఒక్కో కుటుంబానికి 1.50 ఎకరాలకు పట్టారు ఇచ్చారు. తమకు ఇచ్చిన భూముల్లో ఏటా పంట పండించుకొని హాయిగా బతుకుదామని ఆశ పడ్డారు. అయితే ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి అకాల మరణం అనంతరం వారి ఆశలు ఆడియాశగా మారాయి. ఆపై వచ్చిన కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఈ అంశాన్ని మరుగున పడేశాయి. లబ్ధిదారులకు తమ భూములు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత ప్రభుత్వంలో మరుగున పడ్డ వీరి సమస్యను ఆరా తీసి, ఆ ఫైళ్లకు బూజు దులిపి, గుట్టలుగా ఉన్న స్థలాలకు ఒక రూపురేఖకు తెచ్చి సమస్య పరిష్కారం దిశగా కొలిక్కి తెచ్చారు. తీరా భూములు చూపే సమయంలో అధికారం మారడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. భూకేటాయింపులో అధికారులు, ప్రజాప్రతినిధులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పచ్చ కండువా వేసుకున్న వారికి, పచ్చనోటు చూపే వారికి మాత్రమే స్థలాలు చూపుతున్నారు. భూములు లేక, ఆర్థికంగా కుంగిపోయిన పేదలు భూములు ఎక్కడున్నాయో చూపాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వారి భూములు ఎక్కడ ఉన్నాయో ఇంత వరకు తెలియక ఆందోళనకు గురవుతూ తమ ఆగ్రహాన్ని అధికారుల వద్ద వ్యక్తం చేస్తున్నారు.

ముడుపులు ఇస్తేనే పనులు ..

విజయపురం మండలంలో భూ సమస్య తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించుకోవాలంటే రెవెన్యూ అధికారులకు ముడుపులు ఇచ్చుకోవాల్సిందే. ఎంత ఎక్కువ మొత్తంలో ముడుపులు ఇస్తే పనులు అంత తొందరగా పరిష్కారం అవుతాయి. లేకుంటే ఎన్నేళ్లైనా ఆ సమస్య పరిష్కారం కాదన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇటీవల కొందరు రైతులు రూ.10 వేలు నుంచి 50 వేల వరకు ఇచ్చుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మాజీ మంత్రి రోజా చొరవ



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం తరువాత మరుగునపడ్డ ఫైళ్లను మాజీ మంత్రి రోజా బయటకు తీయించి గుట్టను ఒక రూపురేఖకు తెచ్చారు. ఆ తరువాత అధికారం మారడంతో మళ్లీ మొదటికి వచ్చింది. కొందరు అదే గుట్టలో భూములను చదును చేయడంతో కొంత గందరగోళం నెలకొంది. మాకు సంబంధించిన భూములు ఉన్నాయో లేదా ఆక్రమణకు గురయ్యాయో తెలియడం లేదు. – కుమార్, సర్పంచ్, పన్నూరు

మా భూములు చూపించండి



సుమారు 15 ఏళ్లకు ముందు నాకు 1.50 ఎకరాల భూమికి సంబంధించి పట్టాలు ఇచ్చారు. ఇంత వరకు ఆ భూమి ఎక్కడ ఉందో చూపలేదు. రెవెన్యూ కార్యాలయం చుట్టూ చాలా సార్లు తిరిగినా ఏ మాత్రం పట్టించుకోలేదు. ఇప్పుడు కొందరు భూములను చదును చేస్తున్నారని తెలిసింది. మా భూములను కూడా అధికారులు చూపాలని కోరుతున్నాం. – ఆనంద్‌రాజ్, పన్నూరు దళితవాడ

న్యాయం చేయండి



నాకు సెంటు భూమి లేదు. వైఎస్ఆర్ వచ్చిన తరువాత భూమికి సంబంధించి పట్టా తీసుకున్నా. కానీ ఇంత వరకు భూమిని చూపించలేదు. మండల స్థాయి అధికారులు పట్టించుకోలేదు. జిల్లా అధికారులు మాకు న్యాయం చేస్తే, ఆ భూమి సాగు చేసుకుంటాం. – దేవయాణి, పన్నూరు దళితవాడ

పట్టా మాత్రమే ఉంది..



15 ఏళ్లుగా ఇంటిలో పట్టా ఉంది. దానికి సంబంధించిన భూమిని అధికారులు చూపలేదు. అధికారం, డబ్బు ఉన్న వారికే న్యాయం జరుగుతోంది. మాలాంటి పేద వారికి ఎక్కడ న్యాయం జరగదు. జిల్లా అధికారులు మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం. – అనసూయ, పన్నూరు

గుప్తనిధుల కేసులో ఏడుగురి అరెస్ట్

పలమనేరు: పెద్దపంజాణి మండలం వీరపల్లి పరిసరాల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న ఏడుగురిని అరెస్ట్ చేసి, జేసీబీ, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు పలమనేరు, గంగవరం సీఐలు మురళీ మోహన్, పరుశురాముడు తెలిపారు. ఆదివారం పలమనేరు పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. రెండు రోజుల క్రితం వీరపల్లి సమీపంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. సిబ్బంది అక్కడికి చేరుకుని దాడి చేసినట్టు తెలిపారు. పూజలు చేస్తున్న వారిలో ఏడుగురిని పట్టుకోగా మరో ఏడుగురు పారిపోయారని వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో కెళవాతికి చెందిన శ్రీనివాసులు(50), చెన్నైకి చెందిన శరవణ(43), పుంగనూరు మండలం బండపల్లికి చెందిన బి.శ్రీనివాసులు(47), ప్రకాష్(47), శ్రీనివాసరెడ్డి (34), తవణంపల్లి మండలం సిద్ధంపల్లికి చెందిన రమేష్(30), కలికిరి మండలం బండకిందపల్లికి చెందిన జేసీబీ డ్రైవర్ సునీల్(33) వున్నట్టు తెలిపారు. పారిపోయిన వారిలో చౌడేపల్లికి చెందిన మాజీ పోలీసు హెడ్‌కానిస్టేబుల్ వినోద్‌కుమార్, కొత్తకోటకు చెందిన శ్రీనివాసులు, చిత్తూరు కట్టమంచికి చెందిన ఎలక్ట్రీషన్ వెంకటేష్, జేసీబీ యజమాని సంతోష్‌రెడ్డి, చిత్తూరుకు చెందిన ఇద్దరు స్వామీజీలు ఉన్నట్టు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బైరెడ్డిపల్లె : పలమనేరు-కుప్పం జాతీయ రహదారిలోని దేవదొడ్డి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... మహారాష్ట్రకు చెందిన జస్వంత్ (45)సురేష్ (32) బైరెడ్డిపల్లె మండల పరిధిలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనుల నిమిత్తం వచ్చారు. ద్విచక్ర వాహనంపై బైరెడ్డిపల్లెలో అవసరం నిమిత్తం వచ్చి వెళ్తుండగా దేవదొడ్డి వద్ద టెంపో వాహనం ఢీ కొంది. దీంతో జస్వంత్ అక్కడికక్కడే మృతి చెందడంతో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొండను పిండేస్తున్నారు!

- ప్రభుత్వ భూమిలో మట్టి తరలింపు
- నిద్రావస్థలో రెవెన్యూ, మైనింగ్‌శాఖ



తంబుగానిపల్లె రోడ్డు పక్కన కొండపై ట్రాక్టర్‌కు మట్టిని నింపుతున్న హిటాచీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికారుల అలసత్వం, ప్రభుత్వం ఉదాసీనత అక్రమార్కులకు వరంగా మారింది. అప్పదాన్ని పంచిపెట్టే కొండగుట్టలను నిత్యం జేసీబీలు, హిటాచీలుతో మట్టిని తరలిస్తున్నారు. ప్రకృతి సంపదను పరిరక్షించాల్సిన సంబంధిత రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

బంగారుపాళెం మండలంలోని గుండ్లకట్టమంచి రెవెన్యూ, చీకూరు పల్లె పంచాయతీలోని తంబుగానిపల్లె రహదారి సమీపంలో ప్రభుత్వం ఆదీనంలో గుట్ట ఉంది. ఈ గుట్టను హిటాచీతో తవ్వి మట్టిని ట్రాక్టర్లు ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు.జాతీయ రహదారి నుంచి చూస్తే ఈ గుట్ట కనిపిస్తుంది.బంగారుపాళెం మండలంలోని కేజీ సత్రం గ్రామానికి చెందిన ఓ రైతు తిరుపతికి చెందిన వ్యక్తులకు పెట్రోల్ బంక్ నిర్వహించేందుకు స్థలాన్ని లీజుకు ఇచ్చారు.

జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ స్థలానికి సమీపంలోని గుట్టను తవ్వి రెండు రోజులుగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్న స్థలంలో మట్టి నింపి చదును చేస్తున్నారు. సుమారు వెయ్యి లోడ్ల మట్టి అవసరమవుతోంది. ప్రభుత్వ స్థలాల్లో మట్టిని తరలించుకోవాలంటే సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందాల్సింది. ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారులు ఇచ్చిన అనుమతుల మేరకు మట్టిని తరలించాల్సి ఉంటుంది. గుట్టను తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయాన్ని సంబంధిత తహసీల్దార్, సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా.. వారి నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడం గమనార్హం. ప్రభుత్వ భూములకు పరిరక్షకులుగా ఉంటున్న రెవెన్యూ అధికారులు ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించుకుంటూ పోతే ప్రకృతి సంపద అంతరించే ప్రమాదం లేకపోలేదని స్థానికులు అంటున్నారు.

పీఆర్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శశిధర్



ఎన్నికైన ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శశిధర్ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా శశిధర్, ప్రధాన కార్యదర్శిగా చెంచురత్నం యాదవ్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్‌లుగా లక్ష్మీపతి యాదవ్, గిరిధర్‌రెడ్డి, చక్రపాణి, త్రివిక్రమరావు, ఉపాధ్యక్షులుగా మూర్తి, వాణి, లోకేష్, కుమార్, సంయుక్త కార్యదర్శులుగా అలీ, లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

నేడు పాఠశాలలకు కొత్త గురువులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1394 మంది నూతన టీచర్లు సోమవారం నుంచి కేటాయించిన బడుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. మొదట్లో ఉద్యోగంలో చేరేటప్పుడు ఉండే ఉత్తేజం రిటైర్ అయ్యే వరకు కొనసాగించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ నూతన అయ్యోర్లకు సూచించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం

- రూ.28 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

చిత్తూరు అర్బన్ : రూపాయలు పెట్టుబడి పెట్టి డాలర్లు, క్రూడ్ ఆయిల్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేద్దామనుకున్న యువకుడు ఏకంగా రూ.28 లక్షలు ఆన్‌లైన్‌లో పోగొట్టుకున్నాడు. ఇందులో అదృష్టం బాగుండి పోలీసులు రూ.27 లక్షలను ఫ్రీజ్ చేయించారు. చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఈ ఘటనపై కేసు నమోదవగా.. సీఐ నెట్టికంటయ్య వివరాలను వెల్లడించారు. చిత్తూరు నగరంలోని గిరింపేట అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన అలీ చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అలీ తన కుటుంబం సేవింగ్స్ చేసుకున్న రూ.28 లక్షలను బ్యాంకు ఖాతాల్లో దాచి ఉంచారు. ఓ ఏఐ వీడియో అలీ మొబైల్‌కు వచ్చింది. అందులో అలీ తన వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాడు. వెంటనే తనపేరు అర్జున్‌రెడ్డి, ఆన్‌లైన్ ట్రేడింగ్ ఫైనాన్స్ అడ్వైజర్‌గా పరిచయం చేసుకొని తొలుత రూ.21,499 పెట్టుబడి పెట్టమని, దీంతో డాలర్లను ఆన్‌లైన్‌లో ట్రేడ్ చేస్తామని చెప్పిన అర్జున్‌రెడ్డి మూడు విడతలుగా దాదాపు రూ.17.68 లక్షల వరకు బ్యాంకు ఖాతాల నుంచి తన కంపెనీ ఖాతాలకు నగదు బదిలీ చేయించుకున్నాడు. ఆపై డాలర్లలో నష్టం వచ్చిందని ఫోన్ తీయడం మానేశాడు. ఆన్‌లైన్‌లో కంపెనీ కస్టమర్‌కేర్ నంబర్ చూసిన అలీ, వాళ్లకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆపై స్నేహ అనే మహిళ అలీకి ఫోన్ చేసి, తాను క్రూడ్ ఆయిల్‌పై పెట్టుబడి పెట్టిస్తానంటూ నమ్మించింది. ఆమె మాటలు నమ్మిన అలీ మూడు దఫాల్లో రూ.10 లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించాడు. ఇలా మొత్తంగా రూ.27.68 లక్షలు పోగొట్టుకుని.. తన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని, లేకుంటే ఆత్మహత్య చేసకుంటానని ఏడ్చాడు. దీంతో రూ.47 వేలు అలీ ఖాతాలో వేశారు. తాను మోసపోయానని గ్రహించిన అలీ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసిన పోలీసులు, వెంటనే సంబంధిత ట్రేడ్ కంపెనీ ఖాతాల్లో ఉన్న రూ.27 లక్షల నగదును ఫ్రీజ్ చేయించారు. ఆ కంపెనీపై దేశంలో 18 చోట్ల సైబర్‌కేసులు నమోదైనట్లు గుర్తించారు. ప్రస్తుతం కేసును టూటౌన్ సీఐ నెట్టింకటయ్య, క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

బోయకొండ కిటకిట



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ


చౌడేపల్లె : బోయకొండ జనంతో ఆదివారం కిక్కిరిసిపోయింది. కర్ణాటక భక్తులు, స్థానిక భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. వేకువ జామున 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొండపై ఎటుచూసినా భక్తుల సందోహం కనిపించింది. ఆలయంలో క్యూలైన్లు నిండిపోయాయి. గంటల తరబడి నిరీక్షించి భక్తులు దర్శనం చేసుకున్నారు. సుమారు 25 వేలమందికి పైగా అమ్మవారిని భక్తులు దర్శించుకొన్నట్లు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు. ఊహించని రీతిలో వాహనాల్లో భక్తులు తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. నాలుగు కాళ్ల మండపం నుంచి రణభేరి గంగమ్మ ఆలయం వద్దకు వాహనాల రాకపోకలు స్తంభించడం, పోలీసులు పత్తాలేకపోవడంతో భక్తులు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

శ్రీగంధం చెట్లు నరికివేత: వ్యక్తి అరెస్టు

తిరుమల : శేషాచలం అటవీ ప్రాంతంలో శ్రీగంధం చెట్లు నరికివేసిన వ్యక్తిని అటవీశాఖ బేస్ క్యాంప్ సిబ్బంది దాడిచేసి పట్టుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. తిరుమల-పాపవినాశనం రోడ్డులోని జపాలీ తీర్థానికి సమీపంలో ఓ వ్యక్తి శ్రీగంధం చెట్టును నరికివేసి అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించాడు. ఇంతలో అటవీశాఖ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మూడు శ్రీగంధం చెట్టు వేరు భాగాలు రంపాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని తిరుపతికి తరలించి అటవీశాఖ అధికారులు విచారిస్తున్నారు.

కనిపిస్తే.. కరిచేస్తాయ్!

- వీధి కుక్కలు భౌబోయ్
- జిల్లాలో రెచ్చిపోతున్న వైనం
- పెరుగుతున్న కుక్కకాట్లు
- కట్టడికి చర్యలు తీసుకోని అధికారులు



చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీ మంగాపురం గ్రామంలో 20 రోజుల క్రితం మునిస్వామి నాయుడు అనే వృద్ధుడు కుక్క కాటుకు బలయ్యాడు. కుక్క ఆ వృద్ధుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. చనిపోయే ముందు మృతుడిలో రేబిస్ లక్షణాలు కనిపించాయని గ్రామస్తులు చెబుతున్నారు.

ఆరు నెలల క్రితం చిత్తూరు నగరం రీడ్స్ పేటలోని ఓ చిన్నారిపై వీధి కుక్క దాడి చేసింది. తీవ్రంగా గాయపడ్డ ఆ చిన్నారిని స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డు కావడం, ఆ వీడియో బయటకు రావడంతో అధికారులు స్పందించారు.

కాణిపాకం : కుక్కలు రెచ్చిపోతున్నాయి. మనుషులు కనిపిస్తే వెంటాడి దాడి చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ మనుషులను భయాందోళనల కు గురి చేస్తున్నాయి. వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడిస్తూ...పిక్కలు లాగేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒక్కరు వస్తే చాలు గుంపులుగా చేరి మీద పడిపోతున్నాయి. కుక్కల దాడికి ఉలిక్కిపడి పరుగులు పెడుతున్నారు.

గుంపులుగా సంచరిస్తూ..

శునకాలు (గ్రామ సింహాలు) జనాన్ని భయపెడుతున్నాయి. జిల్లాలో ఎక్కడో ఓ చోట జనం రోజూ కుక్క కాటుకు గురవుతున్నారు. ఏ వైపు నుంచి ఏ కుక్క దాడి చేస్తుందేమోనని జనం హడలిపోతున్నారు. గ్రామాలు, పట్టణాల్లోనూ అదే పరిస్థితి. ఏటా వేల మంది కుక్క కాటుకు గురవుతున్నారు. పట్టణం, గ్రామాల్లోనూ శునకాలు అధిక సంఖ్యలో సంచరిస్తూ భయపెడుతున్నాయి. కుక్కల బారిన పడి వేల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 2 లక్షలకు పైగా శునకాలు ఉన్నాయి. పగ లు, రాత్రి తేడా లేకుండా నిత్యం వీధుల్లో సంచరిస్తూ జనాలపై దాడి చేస్తున్నాయి. జనంతో పాటు పశువులు, కోళ్లపై కూడా దాడికి పాల్పడుతున్నాయి. కుక్కలు కరవడం వల్ల జిల్లాలో ఆవు, గేదె దూడలు, మేకలు, గొర్రెలు, కోళ్లు చనిపోతున్నాయి.

జనం బెంబేలు

జిల్లాలో నిత్యం పదుల సంఖ్యలో జనం కుక్కకాటుకు గురవుతున్నారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా శునకాల బారిన పడుతున్నారు. జిల్లాలో ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి నిత్యం కుక్క కాటు బాధితులు రేబిస్ వ్యాక్సిన్ కోసం వస్తున్నారు. చిత్తూరు నగరంలోని అత్యధిక కేసులు నమోదువుతున్నాయి. ఆరు నెలల కాలంలో మొత్తం 8,434 కుక్క కాటు కేసులు నమోదు అయ్యాయి. మండలాల పరిధిలోని పీహెచ్‌సీల్లో కూడా వందల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. చిత్తూరు నగరంలోని రీడ్స్‌పేట, గిరింపేట, ప్రశాంత్‌నగర్, మూడవగేటు, ఎస్టేట్, సంతపేట, కాజూరు, ఇరువారం, కొంగారెడ్డిపల్లి తదిత ప్రాంతాల్లో కుక్కలు గుంపులు భయపెడుతున్నా యి. అలాగే చిత్తూరు రూరల్, తవణంపల్లి, పూతలపట్టు, కార్వేటినగరం తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో కుక్కల స్వైర విహారం చేస్తుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. అయినా అధికారులు కుక్కల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

జిల్లాలో 6 నెలల వ్యవధిలో కుక్కకాటు కేసులు

మండలం	కుక్కకాటు కేసులు
చిత్తూరు పరిధి	2,069
తవణంపల్లి	370
రామకుప్పం	201
పూతలపట్టు	970
పలమనేరు	296
నగరి	776
కుప్పం	451
కార్వేటినగరం	541
ఐరాల	256
చౌడేపల్లి	253
బైరెడ్డిపల్లి	274

రేబిస్ లక్షణాలు

కుక్కకాటు పట్ల నిర్లక్ష్యం పనికిరాదు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్టే. కుక్కకాటు పట్ల నిర్లక్ష్యం చేస్తే రేబిస్ వ్యాధి సోకే అవకాశం ఉంది. కుక్క కరిచిన తర్వాత వ్యాక్సిన్ వేసుకోకపోతే సాధారణంగా 20 నుంచి 90 రోజుల్లో రేబిస్ వ్యాధి సోకుతుంది. పిచ్చి కుక్క అయితే 2 నుంచి 7 రోజుల్లో రేబిస్ వ్యాధి సోకుతుంది. రేబిస్ వ్యాధి సోకిన వ్యక్తికి తిమ్మిర్లు రావడం , ఆందోళన చెందడం, నీరు చూస్తే భయపడడం (హైడ్రోఫోబియా) గతానికి భిన్నంగా ప్రవర్తించడం, కాళ్లు, చేతులకు పక్షవాతం రావడం జరుగుతుంది.

కుక్కకాటుతో వ్యక్తి మృతి



చిత్తూరు రూరల్ (కాణిపాకం): కుక్క కరిచి.. ఆదివారం ఓ వ్యక్తి మృతి మృతిచెందాడు. ఈ ఘటన చిత్తూరు మండలం, తాళంబేడు పంచాయతీ మంగాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు...గ్రామానికి చెందిన మునస్వామి నాయుడు(75)ని ఇరవై రోజుల క్రితం పిచ్చికుక్క కరిచింది. గాయలైన మునస్వామినాయుడు ఆస్పత్రి వెళ్లి టీకా వేయించుకున్నాడు. కానీ సరైనా జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల మునస్వామి మృతి చెందారని, ర్యాబిస్ లక్షణాలు కనిపించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

నిర్లక్ష్యం చేయవద్దు



కుక్క కరిచిన వెంటనే ఆ ప్రదేశాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. వీలైనంత త్వరగా వైద్యున్ని సంప్రదించాలి. సాధారణ కుక్క అయితే రేబిస్ వ్యాక్సిన్ వేస్తే సరిపోతుంది. అదే విధంగా ముఖానికి దగ్గరగా చేతిపైగాని కరిస్తే మెదడు వాపు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఇటువంటి వారికి రేబిస్ ఇమినోగ్లోబిన్ ఎక్కించాల్సి ఉంటుంది. పిచ్చి కుక్క కరిచిన వారికి కూడా ఇమినోగ్లోబిన్ ఎక్కించాలి. కుక్క మంచిదైనా, పిచ్చిదైనా కరిచిన తర్వాత నిర్లక్ష్యం చేయకూడదు.

– సుధారాణి, డీఎంహెచ్ఓ, చిత్తూరు